క్లుప్తంగా


విద్యార్థుల హాజరు పెంచాలి



జెండాకు వందన సమర్పణ చేస్తున్న ఎంఈవో, విద్యార్థులు

స్వర్ణ (కారంచేడు): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల నమోదుతో పాటు, హాజరు శాతాన్ని పెంపొందించుకొనేలా ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో ఎంవీ సత్యన్నారాయణ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని స్వర్ణ జేవీ ఎయిడెడ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను వార్షిక తనిఖీ నిర్వహించారు. మొదట విద్యార్థులతో కలసి ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం పాఠశాలకు సంబంధించిన అన్ని రకాల రికార్డులు పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మధ్యాహ్న భోజనం రుచి చూశారు. కార్యక్రమంలో హెచ్ఎం జేవీ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకట సతీష్‌కు ఇండియన్ ప్రైడ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న చందు సతీష్

వేటపాలెం: వేటపాలెం వాసి చందు వెంకట సతీష్ 'ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ ది ఇయర్-2023' జాతీయ అవార్డు అందుకున్నారు. ఇండియా ప్రైడ్ అవార్డ్స్ వారు ప్రతి ఏటా జాతీయ స్థాయిలో ఔత్సాహిక యువ వ్యవస్థాపకులను ప్రోత్సహిస్తూ వివిధ రంగాల్లో విశేష కృషిచేసే వారికి అవార్డు ప్రదానం చేస్తుంటారు. ఈ నెల 19 వ తేదీన బెంగళూరులో నిర్వహించిన ఈ అవార్డుల ప్రదానోత్సవంలో ప్రముఖ నటి శ్రేయశరణ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. సతీష్ పొలిటికల్ ఇంజినీర్ సంస్థ జాతీయస్థాయిలో రాజకీయ నాయకులను డిజిటల్ ప్రపంచంలో ఉన్నతంగా పరిచయం చేస్తూ వారికి వ్యూహ, ప్రతివ్యూహాలు అందిస్తూ విశేష ఆదరణ పొందింది. అవార్డు గ్రహీత చందు వెంకట సతీష్ బాపట్ల జిల్లా వేటపాలెం మండలం రామన్నపేట చెందిన వ్యక్తి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ స్పేస్‌లో తన ఏడేళ్ల శ్రమే తనను ఇలా ఉన్నత స్థితిలో నిలిపిందన్నారు. తనకు ప్రతిష్టాత్మక అవార్డు రావటానికి తోడ్పాటునందించిన తల్లిదండ్రులు, గురువులు, సంస్థ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

చెరువు మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్



ట్రాక్టర్లను సీజ్ చేసి మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించిన దృశ్యం


మద్దిపాడు: మండలంలోని పెద కొత్తపల్లి పంచాయతీ పరిధిలోఉన్న మారెళ్ల గుంటపాలెం సమీపంలోని చెరువు మట్టిని అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మైనింగ్ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. చెరువు మట్టిని అక్రమంగా ఇటుక బట్టీలకు తరలిస్తున్నారన్న సమాచారం మేరకు చెరువు ప్రాంతానికి వెళ్లగా అక్కడ రెండు ట్రాక్టర్‌లు చెరువు మట్టిని నింపుకుని ఉండటంతో సీజ్ చేసి మద్దిపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మద్దిపాడు ఎస్ఐ శ్రీకాంత్‌ను వివరణ కోరగా.. మైనింగ్ శాఖ వారు సీజ్ చేసి మద్దిపాడు స్టేషన్ కస్టడీకి ఉంచారని, ఆశాఖ వారు వారికి అపరాధ రుసుం విధించవచ్చని తెలిపారు.

నవశకానికి.. నవరత్నాలు

- ప్రభుత్వ పథకాలతో ఆర్థికాభివృద్ధి
- నవరత్నాలతో పేదల కుటుంబాల్లో సంతోషం

కారంచేడు/జే.పంగులూరు/మేదరమెట్ల/అద్దంకి రూరల్:

నాలుగన్నర సంవత్సరాల కాలంలో ఎన్నో మార్పులు. అటు సంక్షేమంలోనూ, ఇటు అభివృద్ధిలోనూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందుకు దూసుకెళ్తోంది. నవరత్నాల సంక్షేమ పథకాలతో పేద, బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపింది. అర్హత ఉంటే చాలు పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత ఈప్రభుత్వానిది. వలంటీర్, సచివాలయ వ్యవస్థతో పాలనలో పెనుమార్పులు తీసుకువచ్చింది. వలంటీర్ వ్యవస్థతో 50 ఇళ్లల్లో ఇంటిముంగిటకే ప్రభుత్వ సేవలందించి లబ్ధిదారుల మోముల్లో చిరునవ్వులు నింపింది. వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారు ఇలా సంతోషాలను పంచుకుంటున్నారు.



అమ్మఒడితో ఆర్థిక సాయం అద్భుతం..



మా పిల్లలను ప్రైవేటు బడికి పంపలేక ప్రభుత్వ పాఠశాలకు పంపుతున్నాం. ప్రైవేటులో అయితే బోలెడు ఖర్చులవుతాయి. ఇంత డబ్బులు మేం ఖర్చుపెట్టలేం. అయితే జగనన్న ప్రభుత్వంలో అమ్మఒడి పథకం ద్వారా మాకు మేలు జరిగింది. అంతేకాదు జగనన్న విద్యాకానుకలో మాపిల్లలకు అన్ని అందాయి. దీంతో మాకు ఖర్చులు తగ్గాయి.

– నూర్‌బాషా అలీంబీ, ఆదిపూడి, కారంచేడు

జగనన్న మహిళలకు ఎంతో మేలు చేస్తున్నాడు..



ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు ప్రభుత్వ పథకాలు ఎంతో అండగా నిలుస్తున్నాయి. మా సుభాషిణి గ్రూపులో మూడో విడత ఆసరా కింద రూ. 1,17,393 గ్రూపులకు జమ కాబడ్డాయి. ఇంతేకాక నేను జగనన్న చేయూత, చేదోడు కింద ఎంతో లబ్ధిపొందా. వైఎస్సార్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి మేము ఎంతో ఆర్థిక అభివృద్ధి చెందాం.

– నూతలపాటి సోవమ్మ, బూదవాడ

జగనన్న మాబిడ్డలకు మేనమామ అయ్యాడు..



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన ప్రారంభం నుంచి మా బిడ్డకు అమ్మఒడి వస్తోంది. ఇప్పటికి నాలుగు సార్లు అమ్మఒడి సొమ్ము పడింది. ఎటువంటి ఇబ్బందులు లేకుండా బడికి పంపగలుగుతున్నాం. మా పిల్లలకు జగనన్న మేనమామ అయ్యాడు. పేదలకు అండగా నిలుస్తున్న జగనన్న రుణం తీర్చుకోలేనిది.

– గుంజి రేణుక, అద్దంకి

పింఛన్ ఇంటికే తెచ్చి ఇస్తున్నారు..



నాకు జగనన్న పాలనలో పెన్షన్, వైఎస్సార్ ఆసరా, జగనన్న చేయూత పథకాలు అందాయి. ప్రతి నెల మొదటి తేది ఉదయం 5 గంటలకే వలంటీర్ వచ్చి పింఛన్ అందజేస్తుంది. ఇంతటి మేలు చేస్తున్న ఇలాంటి ముఖ్యమంత్రిని ఎప్పుడు చూడలేదు. పేదల దేవుడు జగనన్నకు కృతజ్ఞతలు.

– ఉల్లగంటి ధనలక్ష్మి, అద్దంకి

ఇలాంటి ప్రభుత్వాన్ని ఎక్కడా చూడలేదు..



ఈప్రభుత్వంలో అర్హులు ఎవరుంటే వారికి అన్ని పథకాలు అందాయి. మా ఇంట్లో రైతుభరోసా, వాహనమిత్ర, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ పింఛన్ పథకాలు అందాయి. సీఎం జగనన్న అందించిన పథకాల వల్ల ఆర్థికంగా ఎదగడానికి తోడ్పాటు పడుతోంది. పేదలకు ఇలాంటి మేలు చేసిన సీఎంను ఎప్పుడూ చూడలేదు.

– టీ. కోటేశ్వరమ్మ, కొరిశపాడు

హామీలు నెరవేర్చిన ఘనత జగనన్నదే



సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- గడప గడపలో శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి రూరల్: ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. మంగళవారం సంతమాగులూరు మండలంలోని మక్కెనవారిపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును పరిశీలించారు. ప్రభుత్వం అధికారంలోని వచ్చిన నుంచి పొందుతున్న లబ్ధికి సంబంధించిన బుక్‌లెట్‌ను అందజేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దేశంలోఎక్కడా లేని విధంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ప్రభుత్వం జగనన్నదేనన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్ననే సీఎంగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు, మండల కన్వీనర్, ఎంపీపీ సభ్యులు, మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మతల్లి కొలుపులు, ప్రతిష్ట



గ్రామోత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు



మాతుడుపులో భాగంగా పుట్టవద్దకు చేరిన గోరంట్ల వంశస్తులు

బల్లికురవ: మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో గోరంట్ల వారి దేవర గంగమ్మ తల్లి కొలుపులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. సోమవారం ఆలయంలోని శిలలు బొల్లి ఆవులతో చీరాల సముద్రస్నానానికి తరలి వెళ్లారు. మంగళవారం గ్రామోత్సవంతో పుట్ట బంగారం, మాతుడుపు చేపట్టారు. రాత్రికి బొల్లి ఆవులతో గ్రామోత్సవం, బుధవారం తెల్లవారు జామున 3 గంటలకు ఆలయంలో గంగమ్మ తల్లిని ప్రతిష్ఠించనున్నారు. నూతన ఆలయం నిర్మాణం కొలుపుల్లో భాగంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న గోరంట్ల కుటుంబ సభ్యులంతా తరలిరావటంతో గ్రామంలో పండగ వాతావరణ నెలకొంది. ప్రతిష్ట తదుపరి బుధవారం రాత్రికి గ్రామంలో అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి సభ్యులు తెలిపారు. ఈవేడుకల్లో గ్రామంతో పాటు పరిసర గ్రామాల్లోని ప్రజలు పాల్గొని ఈర్ల గంగమ్మ ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో ఉపయోగాలు



జీవామృతం తయారీ విధానాన్ని వివరిస్తున్న మహిళా రైతు ఈశ్వరి

చీరాల టౌన్: ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో ఆకుకూరలు, కూరగాయలు, ఆహార ఉత్పత్తులు తయారు చేయడం వలన పోషకాలతో పాటు సాగు ఖర్చులు చాలా తగ్గుతాయని డీపీఎం వాణీశ్వరి, ఆర్‌బీకే చైర్మన్ రమణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బుర్లవారిపాలెం గ్రామ పంచాయతీలో మహిళా రైతు గవిని ఈశ్వరి ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేస్తున్న ఆకుకూరలు, కూరగాయల సాగుభూమిని ప్రకృతి వ్యవసాయ అధికారులు, సిబ్బంది, పలువురు రైతులతో కలిసి సందర్శించారు. ఈసందర్భంగా డీపీఎం మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా జీవామృతం తయారు చేసుకుని ఆకుకూరలు, కూరగాయలు సాగు చేస్తుండటం వలన సాగు ఖర్చులు తగ్గి పోషకాల ఆహారం లభిస్తుందన్నారు. మహిళలు వ్యవసాయ రగంలో రాణించి ఆర్థికంగా వృద్ధి చెందాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, రాయితీలను గురించి వివరించారు. జీవామృతం తయారీకి వినియోగిస్తున్న ప్రకృతి వ్యవసాయంలో రసాయనాలు లేకుండా తక్కువ ఖర్చులతో తయారు చేసే మిశ్రమాన్ని గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సోములు, వెంకటేశ్వర్లు, శిరీష, కవిత, ఈశ్వర లక్ష్మీ, నిర్మల, ఎ.శ్రీనివాసరెడ్డి, స్వరూప, కవిత తదితరులు ఉన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

ఇంకొల్లు (చినగంజాం): గ్రామాల్లో బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎస్కే నాయబ్ రసూల్ పేర్కొన్నారు. మంగళవారం పలు గ్రామాల్లో మద్యం తాగుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వీరిని బుధవారం కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఎస్సై తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి ప్రజలకు ఇబ్బందులు కలిగించటం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామన్నారు.

రక్షణ కల్పించాలని స్టేషన్‌లో ప్రేమజంట

అద్దంకి రూరల్: తల్లిదండ్రుల నుంచి ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని కోరుతూ మంగళవారం ఓ ప్రేమ జంట స్టేషన్‌కు చేరారు. అందిన వివరాల మేరకు.. అద్దంకి మండలంలోని కొత్తరెడ్డిపాలేనికి చెందిన అమ్మాయి, అద్దంకి పట్టణానికి చెందిన అబ్బాయి ప్రేమించుకుని రెండు నెలల క్రితం తాడేపల్లి వద్ద ఒక గ్రామంలోని దేవాలయంలో వివాహం చేసుకున్నారు. ఈక్రమంలో తమ తల్లిదండ్రుల నుంచి ప్రాణ హాని ఉందని అమ్మాయి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసింది. ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం స్టేషన్‌కు చేరుకున్న ప్రేమ జంటకు తీసుకువెళ్లేందుకు అమ్మాయి తరపున వారు స్టేషన్‌వద్ద ఉన్నారు. మధ్యాహ్నా సమయంలో అమ్మాయి బయటకు రాగానే తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవటంతో వారు వెళ్లిపోయారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి, జంటకు ప్రాణహాని లేకుండా చూస్తామని సీఐ రమేష్ తెలిపారు.

పోలీసు కేసులతో సమయం వృథా



పోలీస్ పికెట్ పరిశీలిస్తున్న సీఐ ప్రభాకర్

బల్లికురవ: గ్రామాలోని ప్రజలు కక్షలు కార్పణ్యాలు విడనాడి ఐక్యతతో ప్రశాంతంగా జీవించాలని సంతమాగులూరు సీఐ ప్రభాకర్ కోరారు. ఇటీవల మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో సర్పంచ్ మహాలక్ష్మిని మార్చే విషయం రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. ఈ పికెట్‌ను మంగళవారం సాయంత్రం సీఐ పరిశీలించి పలు సూచనలు చేశారు. పోలీస్ కేసులు కోర్టుల చుట్టూ తిరగటం వల్ల ఎంతో విలువైన సమయం డబ్బు వృథా అవుతుందన్నారు. గ్రామాల్లో వివిధ సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు. అంతకుముందు జంటహత్యల నేపథ్యంలో వేమవరం గ్రామంలో ఆరేళ్లుగా కొనసాగిస్తున్న పోలీస్ పికెట్‌ను రికార్డులను పరిశీలించారు. ఈ పరిశీలనలో ఎస్సై వీ. వేమన పాల్గొన్నారు.

అంబేడ్కర్ కాంస్య విగ్రహ ఏర్పాటు కమిటీ



వినతిపత్రాన్ని అందిస్తున్న దళిత, ప్రజాసంఘాల నాయకులు

- నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం

చీరాల: మున్సిపల్ పరిధిలోని ముక్కోణం పార్కు కూడలి మున్సిపాలిటీ నిర్మించదలపెట్టిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి అంబేడ్కర్ వాదులతో కలిసి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ తెలిపారు. మంగళవారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో దళిత, ప్రజాసంఘాల నాయకులు అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటులో కమిటీ వేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందించగా వెంకటేష్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ జైసన్‌బాబు, మున్సిపల్ కౌన్సిలర్లు ఎబినేజర్, అరుణ్, కె.యానాదిరావు, ప్రజాసంఘాల నాయకులు జి.ఏసురత్నం, ఎన్.మోహన్‌కుమార్ ధర్మా, డి.విజయ్‌సుందర్, కె.బాబ్జి, డి.శ్రీకృష్ణ, ఎల్.జయరాజ్, ఎస్.అనీల్, వి.వాసు, ఎస్.వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఓటరు సవరణకు పార్టీలు సహకరించాలి



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీవో సరోజిని

చీరాల టౌన్: ఓటరు ఇంటింటి సర్వే, ఓటర్ల సవరణకు అన్నీ రాజకీయ పార్టీలు సహకరించాలని చీరాల ఆర్డీవో, ఎన్నికల అధికారి పి.సరోజిని సూచించారు. బుధవారం చీరాల ఆర్డీవో కార్యాలయంలో ఓటరు సవరణలపై చీరాల నియోజకవర్గంలో ఉన్న అన్నీ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు ఇంటింటి సర్వే జరుగుతుందన్నారు. అందుకు అన్నీ రాజకీయ పార్టీలు సహకారం అందించి నియోజకవర్గంలో సర్వే విజయవంతం చేయాలన్నారు. ప్రతి ఓటరు ఇంటికి బీఎల్‌వోలు వచ్చి సర్వే చేస్తారని ఇంట్లోని ఓటర్లు జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణలు అన్నీ చేస్తారని రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలన్నారు. ఓటరు ఇంటింటి సర్వేపై పలు సూచనలు, సలహాలు అందించి సర్వేను విజయవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, వేటపాలెం తహసీల్దార్ అశోక్‌వర్ధన్, వైఎస్సార్‌సీపీ, బీజేపీ, బీఎస్పీ, టీడీపీ, సీపీఎం, సీపీఐ, జనసేన తదితర పార్టీల నాయకులు ఉన్నారు.

వలపర్లలో క్రీడా పోటీలు



లాంగ్ జంప్‌లో పాల్గొన్న విద్యార్థి

మార్టూరు: మండలంలోని వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఆటల పోటీలు ప్రారంభించారు. ఈ నెల 27వ తేదీ జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏడు రోజుల పాటు ప్రతి రోజు సాయంత్రం బాలబాలికలకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు ఎం నిర్మల తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన 200 మీటర్ల ట్రాక్‌ను ఆమె ప్రారంభించారు. మొదటి రోజు విద్యార్థులకు పరుగు పందెం, లాంగ్ జంప్ తదితర ఆటల పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఆదినారాయణ, పీఈటీ రవి దేవరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి

చీరాల టౌన్: ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించేలా గ్రామస్థాయి అధికారులు విధులు సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో నేతాజీ సూచించారు. మంగళవారం మండలంలోని దేవాంగపురి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామ సచివాలయాలను ఎంపీడీవో తనిఖీ చేసి పెండింగ్ అర్జీలను విచారించారు. గ్రామ సచివాలయాల వారీగా వచ్చిన అర్జీలు, విచారించిన అర్జీలను పరిశీలించి సూచనలు అందించారు. ఎంపీడీవోతో పాటు ఇన్‌చార్జి ఈవోఆర్డీ మురళీబాపూజీ, సచివాలయాల సెక్రటరీలు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు ఉన్నారు.

గుంటూరు చానల్‌కు నిధులు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

పర్చూరు(చినగంజాం): ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలోని వ్యవసాయానికి తక్షణమే గుంటూరు చానల్‌కు నిధులు విడుదల చేయాలని ఎమ్మెల్సీ లక్ష్మణరావు అన్నారు. స్థానిక కొల్లా వారి కళ్యాణ మండపంలో నల్లమడ రైతు సంఘం సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల, గుంటూరు జిల్లాల కలెక్టర్‌లు భూ సేకరణ నోటిఫికేషన్ జారీ చేసినా ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో గుంటూరు చానల్ పొడిగింపు కార్యక్రమం నిలిచిపోయిందని తెలిపారు. గుంటూరు చానల్ కింద సుమారు 70 వేల ఎకరాలు సాగు ప్రశ్నార్థకంగా మారిందని, 70 గ్రామాలకు మంచినీటి సౌకర్యానికి నోచుకోలేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వ జలవనరుల శాఖ నిధులు విడుదల చేసి ఈప్రాంత రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నల్లమడ ప్రాంత రైతులు, రైతు సంఘాలు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

చీమకుర్తి: రైతులు సాగు చేసే పద్ధతుల్లో మేలైన యాజమాన్య విధానాలను పాటించినట్లయితే ఖర్చు తగ్గుతుందని, అధిక దిగుబడి వస్తుందని ఆత్మ పీడీ అన్నపూర్ణ తెలిపారు. మంగళవారం దేవరపాలెంలో రైతు ఉత్పత్తి దారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. సాగు ఖర్చులు తగ్గించుకోవడం ద్వారా నికర ఆదాయం పెంచుకోవచ్చని సూచించారు. ఆత్మ ఫార్మర్ ఓరియెంటెడ్ పథకం ద్వారా వరి సాగు చేసే రైతులకు జీవన ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. స్థానిక మండల వ్యవసాయాధికారి డీవీ భాస్కర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల బహూకరణ



ప్రసాద్ నగర్‌లో దుస్తులు అందిస్తున్న క్లబ్ సభ్యులు

వేటపాలెం: కొత్తపేట పంచాయతీ ప్రసాద్‌నగర్‌లోగల దొబేర బాలికల వసతి గృహంలో చీరాల రోటరీ క్లబ్, చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 50 మంది బాలికలకు రూ. 20 వేల విలువజేసే నూతన దుస్తులు మంగళవారం బహూకరించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు మామిడాల శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం మాదిరిగా జీవితంలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో మామిడాల సాయి మణిప్రదీప్, బత్తుల బాలాజీ, చీరాల కృష్ణమూర్తి, పోలుదాసు రామకృష్ణ, బి హేమంత్ కుమార్, డీవీ సురేస్, టి ఎల్ ప్రతాప్, గూడూరి శివరామ ప్రసాద్, కారంపూడి పద్మిని, బాలాజీ కిరణ్, మల్లేశ్వరి పాల్గొన్నారు.



చినగంజాంలో పండ్లు పంపిణీ చేస్తున్న అభిమానులు

చినగంజాంలో..

చినగంజాం: మెగాస్టార్ చిరంజీవి 68వ పుట్టిన రోజు వేడుకలు మంగళవారం మండల కేంద్రమైన చినగంజాంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక వాల్మీకి వృద్ధాశ్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో వృద్ధులకు పండ్లు, ఫలహారాలు అందజేశారు. చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేసి ఎంతోమందికి ప్రాణం పోశారన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, ఏ హరిబాబు, తోట అశోక చక్రవర్తి, చెరుకూరి లక్ష్మణ, ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు పాకనాటి ఏడుకొండలు రెడ్డి, కుక్కల శ్రీనివాసరెడ్డి, సింగోతు రామారావు, రాసాని రాజేష్, గొల్లపోతు వంశీ, కొక్కిలగడ్డ గోపి తదితరులు పాల్గొన్నారు.